



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 05-08-2022 VIJAYABHANU DAILY ✱ VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 273 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## ఆంధ్రప్రదేశ్‌లో 12 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

### రాజ్యసభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు



న్యూఢిల్లీ : అత్యాచారం కేసులు, చిన్నారులపై జరిగే లైంగిక అత్యాచారం కేసులను (పోక్సో) త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో 12 ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేసినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. క్రిమినల్ లా చట్టానికి అనుగుణంగా అత్యాచారం, పోక్సో కేసుల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం కింద దేశంలో తరువాయి 2లో..

## హైకోర్టు నూతన జడ్జిలుగా ఏడుగురు ప్రమాణస్వీకారం





అమరావతి (విజయభాను న్యూస్) : ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన ఏడుగురు న్యాయాధికారులు గురువారం ప్రమాణం చేశారు. ఏవీ రవీంద్రబాబు, డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ సాగర్, బండారు శ్యాం సుందర్, ఊటుకూరు శ్రీనివాస్, బొప్పన వెంకట లక్ష్మీ నరసింహ చక్రవర్తి, తాళ్లప్రగడ మల్లికార్జునరావు, దుప్పల వెంకటరమణలతో గవర్నర్ హరిచందన్ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణం చేయించారు.

వాస్తవానికి ప్రమాణ స్వీకారం చేయించే విషయంలో గవర్నర్ తన అధికారాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బదలాయిస్తారు. దీంతో కొత్త న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి (సీజే) ప్రమాణం చేయించడం ఆనవాయితీ. సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు మాతృవియోగం కలగడంతో ఆయన వచ్చే పరిస్థితి లేదు. దీంతో గవర్నర్ కొత్త న్యాయమూర్తులతో ప్రమాణం చేయించారు.

### విఎంఆర్డిఏ చేపట్టిన 1 సెంట్ ల్యాండ్ పూలింగ్ లేఔట్లను

## త్వరతగతిన పూర్తి చేయాలి

### రాష్ట్ర పరిశ్రమలు మరియు ఐటీ శాఖామాత్యులు గుడివాడ అమర్నాథ్



**వి.ఎం.ఆర్.డి.ఏ, (విజయభాను న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు - పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా విశాఖపట్నం మరియు అనకాపల్లి జిల్లాల నందు వి.ఎం.ఆర్.డి.ఏ చే అభివృద్ధి పరిచిన ఒక సెంట్ లేఔట్ల గురించి సవివరంగా సమీక్షించిన రాష్ట్ర తరువాయి 2లో..

### ఏపీ హైకోర్టు మార్చే ప్రతిపాదనేదీ పెండింగ్‌లో లేదు

#### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు




దిల్లీ: ఏపీ హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు మార్చే ప్రతిపాదనేదీ పెండింగ్‌లో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యసభలో తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. హైకోర్టు నిర్వహణ ఖర్చును భరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందన్నారు. ఈ విషయంలో హైకోర్టుతో రాష్ట్ర ప్రభుత్వమే సంప్రదించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ప్రస్తుత హైకోర్టును కర్నూలుకు మార్చడంపై పూర్తి ప్రతిపాదన రావాలన్నారు. దీనిపై హైకోర్టు, ఏపీ ప్రభుత్వం రెండూ తమ అభిప్రాయాలను కేంద్రానికి సమర్పించాలని చెప్పారు.

## గోరంట్ల మాధవ్ వీడియో వైరల్.. స్పందించిన ఎంపీ



దిల్లీ: సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై వైకాపా ఎంపీ గోరంట్ల మాధవ్ స్పందించారు. ఆ వీడియో వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను జిమ్ చేసేటప్పటి వీడియోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేశారని పేర్కొన్నారు. అది ఫేక్ వీడియో అని.. తనను డ్యామేజ్ చేసి ఇబ్బంది పెట్టేందుకు తెదేపా వాళ్లు చేస్తున్న కుట్రగా ఆయన ఆరోపించారు. దీనిపై ఇప్పటికే జిల్లా ఎస్పీ, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై ప్రెస్ కౌన్సిల్, హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్తానన్నారు. తన పరువుకు భంగం కలిగించిన వారందరిపై దావా వేస్తానని తెలిపారు. ఆ తరువాయి 2లో..

## పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ చేపట్టాలి



విజయవాడ (విజయభాను న్యూస్) : అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో తరుచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు ఆందోళనకరంగా ఉన్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖలో ఎల్జీ పాలిమర్స్ ప్రమాదం ఎంతటి విధ్వంసాన్ని సృష్టించిందో.. ఎంతమంది ప్రాణాలను హరించిందో ఎప్పటికీ మరచి పోలేమన్నారు. అచ్యుతాపురం సెజ్‌లో సీడ్స్ కంపెనీలో విషవాయువు లీకై 125 మంది మహిళలు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు ప్రజా ప్రతినిధులు, అధికార గణం నిర్లిప్తతే కారణమని ఆరోపించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

“ఇదే కంపెనీలో నెల క్రితమే ఇలాంటి ప్రమాదమే జరిగింది. అప్పుడు 400 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇది పునరావృతం అయింది. అయితే ప్రమాదానికి తరువాయి 2లో..

### విద్యార్థినుల హాస్టల్‌లో

## జిమ్ ప్రారంభం

### పాటలతో సందడి చేసిన సినీ గాయకుడు ధనుంజయ్




ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : విద్యార్థినుల వసతిగృహం(మహారాణిపేట)లో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామశాల(జిమ్)ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తరువాయి 2లో..

### అది మార్ఫింగ్ వీడియో కాదని తేలితే

## ఎంపీ మాధవ్‌పై చర్యలు



అమరావతి (విజయభాను న్యూస్) : హిందూపురం వైకాపా ఎంపీ గోరంట్ల మాధవ్‌పై వచ్చిన అసభ్య వీడియోకు సంబంధించి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు. మాధవ్ వ్యవహారంపై సీఎంతో చర్చించిన తరువాయి 2లో..






## రీసర్వే లక్ష్యాల దిశగా చర్యలు తీసుకోవాలి

### - సిసిఎల్ఏ కమిషనర్ సాయి ప్రసాద్




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వై.ఎస్.ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం క్రింద ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ కమిషనర్ సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఉదయం సిసిఎల్ఏ కమీషనర్ సాయిప్రసాద్ బియాండ్ ఎస్.ఎల్.ఎ, రీసర్వేలపై జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యూటేషన్లలో చేయవలసిన మార్పులను వచ్చే వారానికి పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాల్లో మ్యుటేషన్లలో ఉన్న సమస్యలను పరిష్కరించి సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. బియాండ్ ఎస్.ఎల్.ఏ ఎక్కువగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రీసర్వే బాగానే జరుగుతుందని, వాటితో పాటు మ్యుటేషన్లు ఎస్.ఎల్.ఏలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో నోటిఫికేషన్ జారీ చేయాలని, అలాగే సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. వి.ఆర్.ఓ, ఉప తహసీల్దార్, తహసీల్దార్ లాగిన్ లో ఉండే సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళ్లాలని, వచ్చే సమావేశానికి పెండింగ్ ఉంటే సంబంధిత ఉప తహశీల్దార్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను హెచ్చరించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె. యస్.విశ్వనాథన్,జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, భూసర్వే మరియు రికార్డుల శాఖ సహాయ సంచాలకులు ఆర్. విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య నిర్వహణ పై జివిఎంసి కమిషనర్ ఆగ్రహం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పారిశుధ్యం సరిగా నిర్వహించడం లేదని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ శానిటరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మూడవ జోన్, 21వ వార్డు పరిధిలోని పాండురంగాపురం, ఆర్కె బీచ్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పాండురంగాపురంలో గత రెండు రోజుల నుండి వ్యర్థాలను తొలగించక పోవడంపై శానిటరీ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే క్లాప్ వాహనాన్ని రప్పించి, వ్యర్థాలను తొలగించారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్లు శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డులో పలు దుకాణాలను ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. బీచ్ రోడ్డులో కొబ్బరి చెట్ల వద్ద డస్ట్ బిన్లు అస్తవ్యస్తంగా వుండడం గమనించి ఆయనే స్వయంగా సరిచేశారు. బీచ్ రోడ్డులో ప్లాస్టిక్ వినియోగం లేనప్పటికీ బయటి నుండి వచ్చే పర్యాటకులు ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో తెచ్చుకొని వాటిని డస్ట్ బిన్లలో వేయకుండా బహిరంగంగా పడవేస్తున్నారని, వారిపై నిఘా పెట్టి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎంతో సుందర నగరమైన విశాఖను పర్యావరణంలో ప్రథమ స్థానంలో ఉంచేందుకు నగర కీర్తిని పెంపొందించేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు.

ఈ పర్యటనలో అదనపు కమిషనర్ వై. శ్రీనివాస రావు, జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, ఎఎంఓహెచ్ డాక్టర్ కిరణ్, ఎసిపి వెంకటేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.



# గీతంలో గాంధీ మ్యూజియం సందర్శనకు ఆహ్వానం




సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : అజాదీకా అమృత్ మహోత్సవ్ లో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమేనిటీస్ మరియు సోషల్ సైన్సెస్ లో ఏర్పాటు చేసిన గాంధీ మ్యుజియంను పాఠశాలల విద్యార్థులు మరియు నగర ప్రజల సందర్శనకు ఈ నెల 15వ తేదీవరకు తెరిచి ఉంచుతున్నట్లు డైరక్టర్ ప్రొఫెసర్ బి.నళిని తెలిపారు. స్వాతంత్ర సమరంలో గాంధీ మహాత్ముడు పాల్గొన్న వివిధ ఉద్యమాలు గురించి, చారిత్రక ఘట్టాలతో ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రతి ఒక్కరు వీక్షించవచ్చునని తెలిపారు. గాంధీ ఛరఖా, గాంధీ మహాత్ముని లేఖలు, భాతరీయ సంప్రదాయ చేనేతలు తదితరాలను గాంధీ మ్యూజియంలో ఉంచామన్నారు. ఆజాది అమృత మహోత్సవం లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఉదయం 9 గంటల నుంచి సాయిత్రం 5 గలటల వరకు తెరిచి ఉంటుందన్నారు.

## విశాఖపట్నంలో వినూత్న పట్టణాభివృద్ధి ప్రభావాలపై ఫోటోగ్రఫీ పోటీ పోస్టర్ ఆవిష్కరణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : కార్యక్రమం కింద నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ (NIUA) పౌరుల యొక్క దృక్కోణంలో భారతదేశంలోని వినూత్న ఆవిష్కర ణలతో నడిచే పట్టణ అభివృద్ధి యొక్క ప్రభావాలను వివరించే ఉద్దేశ్యంతో Cities of Tomorrow అనే ఫోటోగ్రఫీ పోటీని నిర్వహిస్తున్నారు. ఈ పోటీకి సంభందించిన పోస్టర్ ను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమీషనర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఎస్ ఎస్ వర్మ, చీఫ్ ఇంజనీర్ రవికృష్ణ రాజుతో పాటు జివిఎంసి అధికారులు, ఎన్ఐయుఎ ప్రతినిధులు మరియు స్మార్ట్ సిటీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో వారిరువురూ మాట్లాడుతూ ఈ పోటి లో బహిరంగ ప్రదేశాలు, సస్టైనబుల్ మొబిలిటీ, ఈ-గవర్నెన్స్ మరియు సామాజిక ఆవిష్కరణ అనే 4 థీమ్స్ నుండి ఆహ్వానాలను స్వీకరిస్తున్నారు. ఈ 4 థీమ్ లలో ఏ థీమ్ నుండి అయిన 3 ఫొటోస్ లను ఈ పోటీకి పంపించవలసి వుందని వారు తెలిపారు. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్లు మిస్టర్ రఘు రాయ్, శ్రీమతి కేతకీ సేత్ మరియు మిస్టర్ సౌనక్ బెనర్జీలతో కూడిన ప్యానెల్ ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందని, మొదటి బహుమతి రూ. 50,000/- రెండవ బహుమతి రూ. 25,000/- మరియు మూడవ బహుమతి రూ. 10,000/- లను బహుమతులుగా అందజేస్తారు. విజేత ఎంట్రీలు అక్టోబర్ 2022లో న్యూ ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగే పబ్లిక్ ఎగ్జిబిషన్‌లో కూడా ప్రదర్శించబడతాయని తెలిపారు. ఈ పోటిలో పాల్గొనటానికి చివరి తేది ఆగష్టు 26, 2022. మరిన్ని వివరాల కోసం ఈ వెబ్ సైట్ ను చూడండి https://niua.in/citiis/citiis-photos-competition.

# అక్రమ అరెస్టులను ఖండిచండి - సిపిఎం

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకురాలు పెద్దపాటి అమ్మాజీ కుమార్తె వివాహానికి వస్తున్న సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లను అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్స్‌లకు తరలించడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాయకరావుపేట పెళ్ళికి వస్తున్నారనే కారణంగా పోలీసులు అత్యుత్సాహంతో సిపిఎం నాయకులను నిర్భంధించి అరెస్టులు చేయడం దుర్మార్గం. ముఖ్యమంత్రి పర్యటన పేరుతో సిపిఎం నాయకులను అరెస్టు చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. సిఎం ఏ జిల్లాకు పర్యటనకు వెళ్ళినా ముందుగా సిపిఎం నాయకులను అరెస్టు చేయడం పరిపాటిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం నాయకులంటే ఎందుకు అంత భయం? మీరు ప్రజలకు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తారనా? చట్టాలను ఉల్లంఘించి, ప్రజాస్వామ్యంలో పౌరులు హక్కులకు భంగం కలిగించే విధంగా రాత్రి 11 గంటల సమయంలో సిపిఎం నాయకుల ఇళ్లను చుట్టు ముట్టి ఇళ్ళను ఎందుకు చోదాచేసారు? నాయకుల ఇళ్ళ చుట్టూ ఉన్న ఇళ్లలో కూడా చోదాలు చేయడం దుర్మార్గం. అరెస్టు చేసిన నాయకులను భేషరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

## విఎంఆర్డిఏ చేపట్టిన 1 సెంట్ ల్యాండ్ పూలింగ్ లేఔట్లను

# త్వరతగతిన పూర్తి చేయాలి

పరిశ్రమలు మరియు ఐటీ శాఖామాత్యులు గుడివాడ అమర్నాథ్ విశాఖ జిల్లా కలెక్టర్ మరియు విఎంఆర్డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఏ.మల్లికార్జున విఎంఆర్డిఏ ఇప్పటివరకు అభివృద్ధి పరిచిన లేఔట్ వివరాలను, లక్ష్యాలను, చేపడుతున్న కార్యక్రమాలు గూర్చి సవివరముగా వివరించడం జరిగింది.

అనంతరంగుడివాడ అమర్నాథ మాట్లాడుతూ .. అనకాపల్లిలో విఎంఆర్డిఏ చేపట్టిన 1 సెంట్ ల్యాండ్ పూలింగ్ లేఔట్లను త్వరతగతిన పూర్తి చెయ్యాలని, అలానే రైతులకు ఇవ్వవలసిన ప్లాట్స్ కేటాయింపునకు అవలంభిస్తున్న విధి విధానాలను అడిగి తెలుసుకొని కొన్ని సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగినది. రైతులకు కేటాయించిన ప్లాట్లను (Reconstituted plots) తక్షణం అభివృద్ధి పరిచి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఆర్ డి ఓ చిన్ని కృష్ణ , సూపరింటెండెంట్ ఇంజనీర్ భవానీశంకర్, కార్యనిర్వహక ఇంజనీర్లు బలరామరాజు, శ్యాంసుందర్, తాతాజీ, రమణమూర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి , రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతరం మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

## రెక్టార్ ఆచార్య కె.సమత




ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : యువతరం మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ అమెరికన్ కార్నర్ లో గురువారం ఉదయం ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. భారత ప్రభుత్వం సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖతో ఈ కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఈ సందర్భంగా రెక్టార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్య భారత్‌ను నిర్మించడానికి యువత భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలుగా మారితే ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. తద్వారా కెరియర్ నాశనం అవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని యువతరం మత్తుపదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఏయూ పాలక మండలి సభ్యులు ఆచార్య జేమ్స్ స్టీఫెన్, డాక్టర్ రవి విన్సెంట్, డాక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# విద్యార్థినుల హాస్టల్‌లో జిమ్ ప్రారంభం



ప్రారంభించారు. అనంతరం హాస్టల్‌డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థినులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటూ విద్యలో ప్రగతి సాధించాలన్నారు. విద్యార్థులు వసతులను సద్వినియోగం చేసుకుంటూ తమ ఆకాంక్షలను, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీ గాయకుడు ధనుంజయ్ పలు సినీగీతాలను ఆలపించి, యువతను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత,రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.రాజేంద్ర కర్మార్కర్, వి.విజయలక్ష్మి, చీఫ్ వార్డెన్ ఏ.పల్లవి, బి.మునిస్వామి, కె.రమేష్ బాబు, సిఎస్ఓ మహ్మద్ ఖాన్, డీన్ ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.

## గోరంట్ల మాధవ్ వీడియో వైరల్.. స్పందించిన ఎంపీ

వీడియోను ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని.. కుట్రలు, దుర్మార్గాలను బయటపెడతామని మాధవ్ చెప్పారు. ఈ విషయంలో జిల్లా ఎస్పీకి ఇప్పటికే ఫిర్యాదు చేశామని.. కచ్చితంగా లీగల్ యాక్షన్ ఉంటుందని హెచ్చరించారు. దమ్ముంటే తనను నేరుగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు.

# పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ చేపట్టాలి

కారణాలు ఏంటనే వివరాలను అధికారులు, ఇటు కంపెనీ ప్రతినిధులు చెప్పకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రధానంగా ఔషధ, రసాయన, ఉక్కు, జౌళి కర్మాగారాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పరవాడ, దువ్వాడ, అచ్యుతాపురం పారిశ్రామిక ప్రాంతాల చుట్టుపక్కల కాలనీవాసులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో, ఏ విషవాయువు ప్రాణాలు తీస్తుందో అని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

రాష్ట్రం, దేశ ప్రగతికి పరిశ్రమలు ఎంతో అవసరం. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే ఆ ప్రగతి ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను పణంగా పెట్టి కాదు. పారిశ్రామిక ప్రమాదాలు నివారణకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలసికట్టుగా పనిచేయాలి. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ చేపట్టాలి. అవినీతికి తావులేకుండా ఆరోగ్యకరమైన పారిశ్రామిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం పని చేయాలి. ఎటువంటి వైఫల్యం ఎదురైనా అందుకు ప్రభుత్వంలోని పెద్దలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్యాస్ లీకేజీ ప్రమాదంలో అస్వస్థతకు గురైన మహిళా కార్మికులకు ప్రభుత్వం మేలైన వైద్యాన్ని, పరిహారాన్ని అందించాలి'' అని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు.

## అది మార్ఫింగ్ వీడియో కాదని తేలితే

# ఎంపీ మాధవ్‌పై చర్యలు

అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. ''ఎంపీ మాధవ్‌పై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. తనపై వచ్చిన ఆరోపణలను మాధవ్ ఖండిస్తున్నారు. అది మార్ఫింగ్ వీడియో అని పోలీసులకు ఫిర్యాదు చేశారు.. దానిపై పోలీసు విచారణ జరుగుతోంది. మార్ఫింగ్ వీడియో కాదని తేలితే అతనిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళలను కించపరిచేలా ఎవరైనా వ్యవహరిస్తే పార్టీ సహించదు'' అని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ఓ మహిళ పట్ల వీడియో కాలింగ్‌లో అసభ్యంగా ప్రవర్తించిన తీరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. రెండ్రోజుల క్రితం ఎంపీ గోరంట్ల .. ఓ మహిళతో వీడియో కాలింగ్‌లో మాట్లాడుతూ... వీడియో కాల్‌లో తన దుస్తులు లేకుండా ఉన్న చిత్రాలను మహిళకు చూపించడంతో ఆమె సీరియస్‌గా తీసుకుని వైరల్ చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఈ వీడియోపై గోరంట్ల మాధవ్ కూడా స్పందించారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను జిమ్ చేసేటప్పటి వీడియోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేశారని పేర్కొన్నారు. అది ఫేక్ వీడియో అని.. తనను డ్యామేజ్ చేసి ఇబ్బంది పెట్టేందుకు తెదేపా వాళ్లు చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే జిల్లా ఎస్పీ, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై ప్రెస్ కౌన్సిల్, హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్తానన్నారు. తన పరువుకు భంగం కలిగించిన వారందరిపై దావా వేస్తానని తెలిపారు. ఆ వీడియోను ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని.. కుట్రలు, దుర్మార్గాలను బయటపెడతామని మాధవ్ చెప్పారు. కచ్చితంగా లీగల్ యాక్షన్ ఉంటుందని హెచ్చరించారు. దమ్ముంటే తనను నేరుగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 12 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

1023 ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేయాలని 2019 అక్టోబర్‌లో న్యాయ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం దేశంలో 728 ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల కాలపరిమితిని ఒక ఏడాదికి మాత్రమే పరిమితం చేయాలని ముందుగా నిర్దేశించినా తదుపరి 2023 మార్చి 31 వరకు వీటిని కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు మంత్రి చెప్పారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు 1,572 కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. అందులో కేంద్ర ప్రభుత్వం వాటా 971 కోట్ల రూపాయలని మంత్రి తెలిపారు. నిర్భయ నిధుల నుంచి కేంద్రం తన వాటాను కేటాయిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికి దేశంలోని అన్ని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులలో కలిపి లక్షకు పైగా కేసులను పరిష్కరించినట్లు మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల పనితీరును మదింపు చేసిన నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ నివేదిక ప్రకారం మొత్తం పోక్సో కేసులలో 17.64% కేసులలో శిక్షలు విధించినట్లు తెలిపారు. ప్రత్యేక కోర్టులు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఆన్‌లైన్ మానిటరింగ్ పద్ధతి ద్వారా నెలవారీ సమీక్షలు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో తమ మంత్రిత్వ శాఖ తరచుగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# ఎంఈఓ కార్యాలయం ను సందర్శించిన అడిషనల్ డెరైక్టర్



భీమునిపట్నం: విజయభాను న్యూస్ విశాఖ జిల్లా స్పెషల్ ఆఫీసర్ మరియు అడిషనల్ డెరైక్టర్ (ఎం డి ఎం) ఎ సుబ్బారెడ్డి బుదవారం స్థానిక ఎం ఈ ఓ కార్యాలయం ను సందర్శించి పుస్తకాలు మరియు యూనీఫాంలు ఏవిధంగా పంపిణీ జరుగుతుందో అడిగి తెలుసు కున్నారు.అలాగే జీ వి ఎం సీ రెండవ వార్డ్ యూ పి పాటశాలను తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనం అమలు పరిచేవిదానం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ కె అమృత బాలామణి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు




అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని సర్పంచ్ పీలా నర్సింగరావు అన్నారు. గురువారం ఖాజీ పాలెం సచివాలయంలో ఆయన కొత్త వైయస్ఆర్ పింఛన్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యు.వి రమణమూర్తి రాజు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవజాత శిశువు మరణాలు అరికట్టాలి

## మృతి చెందిన నవజాత శిశువులకు అంబులెన్స్ కేటాయించాలి

## గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ



అల్లూరి సీతారామరాజు జిల్లా. విజయభాను. పాడేరు జిల్లా ఆస్పత్రిలో నవజాత శిష్యులు మరణాలు అరికట్టాలని, ఆసుపత్రిలో మరణిం చిన నవజాత శిష్యులను ఐటీడీఏ తక్షణమే అంబులెన్స్ కేటాయించాలని, గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఒక ప్రకటనలు డిమాండ్ చేస్తారు. వారు మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఆదివాసి ప్రాంతమైన 11 మండలాల గర్భిణీ స్త్రీలు డెలివరీ నిమిత్తం వైద్య సేవల కోసం పాడేరు జిల్లా ఆస్పత్రిలో వస్తూ ఉంటారు. అయితే ఈ మధ్యకాలంలో ఎక్కువగా నవ జాత శిష్యులు మృత్యువాత పడుతు న్నారని, దానికి కారణాలు ఏమిటో అమాయక ఆదివాసులకు అంత చిక్కడం లేదని, అందులో నవజాత శిష్యులు ఎక్కువ మృత్యువాత పడుతున్నారని అధికారులు ప్రభుత్వం స్పందించి నవ జాత శిశు మరణాలు అరి కట్టాలని, జిల్లా ఆసుపత్రిలో నవజాత శిష్యులు మృతి చెందితే తక్షణమే అంబులెన్స్ ను కేటాయించాలని...

నవజాత శిష్యులు మర ణిస్తే అంబులెన్స్ ఇవ్వక డెడ్ బాడీని వారి స్వగ్రామానికి తీసుకొని వెళ్లా లంటే నరకయాతన పడు తున్నారని తక్షణమే ఐటీ డీఏ అధికారులు ప్రభుత్వం స్పందించి అంబులెన్స్ కేటాయించాలని వారు ప్రకటనలు డిమాండ్ చేశారు.

# ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాను

*- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు - తారువలో నూతన క్యాంపు కార్యాలయం ప్రారంభం*





దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే సేవలు అందిస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని తన స్వగ్రామం తారువలో నూతన క్యాంపు కార్యాలయాన్ని గురువారం కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. మాడుగుల నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యత కల్పించిన ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డికి బూడి కృతజ్ఞతలు తెలిపారు. క్యాంపు కార్యాలయం ప్రారంభం సందర్భంగా అనారోగ్యంతో బాధపడి చికిత్స పొందిన పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో...

ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, జడ్పిటిసి కర్రి సత్యం కె.కోటపాడు జడ్పిటిసి ఈర్లే అనురాధ, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, ప్రజాస్వామ్య హక్కుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ, గాలి సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 35వవార్డు చేతివృత్తి కార్మికులకు ఈ శ్రమ కార్డ్స్ అందజేసిన

## వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు పరిధిలో డాన్ బాస్కో స్కూల్ వారు నవజీవన్ ఫౌండేషన్ సంస్థ వారి ఆధ్వర్యంలో 35వ వార్డులో ఉన్న చేతివృత్తి కార్మికులకు ఈ శ్రమ కార్డ్స్ రూపొందించి స్వచ్ఛందంగా మన ముఖ్యఅతిథి పేదల ప్రజా ప్రతినిది అయిన మన 35 వార్డ్ కార్పొరేటర్ విల్లూరు భాస్కరరావు చేతుల మీదుగా ఈ శ్రమ కార్డ్స్ అందజేయడం జరిగింది.అలాగే ఈ నవజీవన్ ఫౌండేషన్ వారు ఉచితంగా స్వచ్ఛందంగా పిల్లలందరికీ కూడా ఫ్రీ ట్యూషన్ ప్రైవేటు విద్యని నేర్పించడంలో వీరందరూ కూడా సఫలీకృతం అయ్యారని, అక్కడ చదువుకుంటున్న పిల్లలందరికీ విల్లూరి భాస్కర రావు గారు కూడా ప్రతి ఒక్కరికి కూడా ఆయన స్వచ్ఛందంగా ఆయన సొంత నిధులతో నోట్ బుక్స్ ఏర్పాటు చేసి అక్కడ ఉన్న పిల్లలందరికీ కూడా పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్త బత్తి మంగరజుగారు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరు కూడా పాల్గొని జయప్రదం చేయడం జరిగినది ఇట్లు మీ సోదరుడు మీ సేవకుడు విల్లూరి భాస్కరరావు 35 వ వార్డు కార్పొరేటర్ వైసిపి జీవీఎంసీ.

# పాడిరైతులకు సబ్సిడీ పై

# సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండలంలోని పాడి రైతులకు 60 శాతం సబ్సిడీ పై మిశ్రమ దాణా పంపిణి చేస్తున్నట్లు స్థానిక పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. ఉషాకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక కిలో టి ఎం ఆర్ పశుదాణా అసలు ధర 15.90 రూపాయలు కాగా 60 శాతం సబ్సిడీ పై 6.50 రూపాయలకే పంపిణి చేస్తున్నట్లు తెలిపారు.ఒక్కొక్క రైతు 200 నుండి 1800 కిలోలు వరకు దాణా పొందవచ్చునన్నారు. దాణా కావలసిన రైతులు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో ఆధార్ కార్డు చూపించి బుకింగ్ చేసుకోవాలన్నారు.

ఈ దాణా మేత వలన పాడి పశువులు అధిక పాలను దిగుబడిని అందిస్తాయన్నారు. సబ్బవరం మండలంలో 39 యూనిట్లు పశుదాణా పంపిణి చేశారు. అసకపల్లి లో 13 యూనిట్లు,బంగారమ్మపాలెంలో ఐదు యూనిట్లు, గుల్లేపల్లి లో 4 యూనిట్లు , గొల్లలపాలెంలో ఒక యూనిట్ చొప్పున పంపిణి చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ బాబు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన

# దేవేందర్ రెడ్డి పై కేసు నమోదు చేయండి

## హుకుంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



అల్లూరిజిల్లా, విజయభాను న్యూస్: హుకుంపేట మండలం పోలీస్ స్టేషన్ లో తెలుగదేశం పార్టీ నాయుకులు మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి వైఎస్సార్సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దేవేందర్ రెడ్డీ పై కేసు నమోదు చేయాలని పిర్యాదు చేశారు ఈ సందర్భంలో మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్సీపీ కి చెందిన వైఎస్సార్సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దేవేందర్ రెడ్డీ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు పై అనుచిత వ్యాఖ్యలు ట్విట్టర్ వేదికగా చేశారు ఐతే ఇటీవల స్వర్గస్తులైన స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి కుమార్తె కంటమనేని ఉమా మహేశ్వరి చావుకి లోకేష్ కారణమంటూ సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దేవేందర్ రెడ్డీ వ్యాఖ్యలు చైయదన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్సీపీ ప్రభుత్వం పై ప్రజా వ్యతిరేక పెరుగుతుంది అని లోకేష్ కు వస్తున్నా ప్రజాదరణ చూసి ఓర్వలేక వైఎస్సార్సీపీ అధిష్టానమే టీడీపీ నాయకులు పై బురద జల్లే కార్యక్రమాలు చేస్తుంది అని శవ రాజకీయాలు మానుకోవాలని దేవేందర్ రెడ్డీ పై కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ వెంట పార్టీ ప్రధాన కార్యదర్శి సూర్యకాంతం హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమా బాకురు సర్పంచ్ వెంకట రమణ రాజు అండిభ సర్పంచ్ సత్యనారాయణ దారెల సర్పంచ్ పాంగి పాండు రంగ స్వామి మాజీ జి.సి.సి. చైర్మన్ శెట్టి లక్ష్మణుడు తెలుగు మహిళ పార్లమెంట్ కార్యదర్శి సాగర సత్యవతి త్రినాధ్ సాగర్ మురళి కృష్ణారావు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# రావాడలో అజాది కా అమృత్ మహోత్సవ్




పరవాడ (విజయభాను న్యూస్) : ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం లో భాగము గా రావాడ గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు అధ్వర్యంలో గురువారం రావాడ గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించి పారిశుధ్య కార్మికులుతో వీధులని శుభ్రం చేయించి బ్లీచింగ్ చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి చలపతి సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాండిక్స్ సందర్శించిన పిసిబి సెక్రటరీ విజయ్ కుమార్



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : బ్రాండిక్స్ లో సీడ్స్ పరిశ్రమలో విషవాయువు లీకేజి జరిగిన సంఘటనపై ఆంధ్ర ప్రదేశ్ పాల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సెక్రటరీ విజయ్ కుమార్ గురువారం బ్రాండిక్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో వెలువడుతున్న విషవాయువులను కనుగునేందుకు వివిధ మెడికల్ రీసర్చ్ కేంద్రాల ఆదేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు నెలల క్రితం జరిగిన సంఘటన పరిగణలోకి తీసుకుంటూ విషవాయువు వెలువడటానికి అన్ని కోణాల్లో సంపూర్ణ దర్యాప్తు చేస్తామన్నారు.

# సాగులో సహజ వనరులు ఉపయోగించండి

## నర్సీపట్నం మండల వ్యవసాయ శాఖ అధికారి డి ఏ రావు



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం (విజయభాను న్యూస్) : వ్యవసాయ సాగులో సహజ వనరులు ను ఉపయోగిస్తూ తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునని వ్యవసాయ అధికారి డి. అప్పారావు తెలిపినారు. నర్సీపట్నం మండలంలో గల బలిఘట్టం రైతు భరోసా కేంద్రం పరిధిలో గల లింగాపురం గ్రామంలోని రైతులకు పొలంబడి కార్యక్రమంలో నిర్వహించి, కార్యక్రమంలో పొలంబడి పది సూత్రాలను వివరించారు. అందులో విత్తన శుద్ధి, విత్తన మొలక పరీక్షలు చేయు విధానము, మానవునిపై పురుగు మందుల విష ప్రభావం మొదలగు వాటిని రైతులతో చేయించి, అవగాహన కల్పించారు. ఈ పొలంబడి కార్యక్రమంను 14 వారాలపాటు ఉంటుందని, 30 మంది రైతులతో ఈ కార్యక్రమంను నిర్వహిస్తామని వ్యవసాయ అధికారి తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో అనగా సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబిస్తూ రైతులు తమ నిర్ణయాలను తామే తీసుకోవడం పొలంబడి కార్యక్రమంలో ముఖ్య ఆశయం అని అన్నారు. 14 వారాలపాటు వరి పంట సాగుపై సంపూర్ణ శిక్షణ ఇస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వాలంటీర్లు,ఎంపీఈఓ ప్రసాద్, ఏఈఓ శ్రీహరి, విఏఏ రమణ, లక్ష్మణరావు తదితరులు హాజరైనారు.

# విజయభాను సంపాదకీయం

## ఆవు-పులి కథ అందరికీ తెలిసిందే...

'కర్షక వీరుల కాయం నిండా/ కాలువగట్టే ఘర్మజలానికి/ ఘర్మజలానికి/ ధర్మజలానికి/ ఘర్మజలానికి ఖరీదు లేదోయ్' అని మహాకవి శ్రీశ్రీ చెప్పిన దానిలో 'ధర్మజల'మనేది అమ్మ పాలకూ వర్తించే గొప్ప పదం. తల్లిప్రేమకు సాటి మరేదీ రాదు. తల్లిపాలకు మరే ప్రత్యామ్నాయమూ లేదు. తల్లి పాల ప్రాధాన్యతను తెలిపే ఆవు-పులి కథ అందరికీ తెలిసిందే. అడవికి మేతకెళ్లిన ఆవు... ఓ పులికి చిక్కుతుంది. చంపేస్తానని హూంకరిస్తుంది. అలాంటి ప్రాణాపాయ స్థితిలోనూ ఆవుకు తన బుజ్జి దూడ గుర్తొస్తుంది. తల్లి మనసు తల్లడిల్లుతుంది. బిడ్డకు చివరిసారిగా పాలిచ్చి వస్తానని పులిని బతిమాలుతుంది. ఆ ఆవు చివరి కోరిక తన బిడ్డకు పాలివ్వడమే. దీన్నే భోజరాజీయంలో 'మునుమును బుట్టి నాకు నొక ముద్దుల పట్టి, యతండు పుటియే/ డెనిమిది నాళ్ళపాటిగలడింతియ, పూరియు మేయ నేరడే/ జని, కడుపార జనుడిపి చయ్యన వచ్చెద, నన్ను బోయిర/ మ్మని సుకృతంబు గట్టి కొన వన్న దయాగుణ ముల్లసిల్ల గన్' అని వర్ణించాడు కవి. అమ్మ ప్రేమకూ... అమ్మ పాలకూ జాతి భేదాల్లేవు. అన్ని జీవుల్లోనూ తల్లి తల్లే. అది శునకమైనా, వరాహమైనా, గోవైనా... ఏ జంతువైనా తన బిడ్డకు ఎంతో ఆప్యాయంగా పాలిస్తూ తన్మయత్వం చెందుతాయి.

తల్లి పాలు... కల్తీ లేనివి, కల్తీ చేయలేనివి. నవమాసాలు గర్భంలో ఉన్న బిడ్డతో ప్రేమ బంధాన్ని మరింత బలోపేతం చేసేవి. ఉద్యోగ అవసరాలు, అనారోగ్యం వంటి కారణాలతో కొందరు తల్లులు బిడ్డలకు పోతపాలు పడుతుంటారు. ఈ అవసరాన్ని కూడా సొమ్ము చేసుకునే ప్రబుద్ధులు... స్వచ్ఛమైన పాలను కల్తీ చేస్తున్న ఘటనలు కోకొల్లలు. పాలు కరువై... పొంగునీళ్లతో పసి కడుపు నింపే తల్లులకూ ఈ దేశంలో కొదవ లేదు. 70 కోట్ల మంది పేద ప్రజలున్న ఈ దేశంలో, మూడు పూటలా తినేందుకు సరైన ఆహారం కూడా లేక అర్ధాకలి జీవితాలు గడుపుతున్నారు. పౌష్టికాహార లోపంతో లక్షలాది బిడ్డలు అనారోగ్యం పాలవుతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా పసిబిడ్డలు తాగే పాలపై కూడా జీఎస్టీ విధించిన ఘనత మోడీ ప్రభుత్వానిది. 'బిడ్డల పాలకై / బిచ్చమెత్తు దేశంలో/ రాళ్లకు పాలిచ్చు/ కథ నశించునదెన్నడో' అంటాడు కరుణానిధి. తల్లిపాలు తాగని నవజాత శిశువులు డయేరియా వ్యాధిన పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. డబ్బా పాలతో ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా... ఎదుగుదల తక్కువగా ఉంటుంది. అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలి. ఆ పాలలో శక్తివంతమైన యాంటీబాడీలు ఉంటాయి. ఇవి బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తినిస్తాయి. ముర్రుపాలు బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకా అని చెప్పొచ్చు. అలాంటి బలమైన తల్లిపాలు సరిపోక, భారతదేశంలో ఏటా లక్షమంది శిశువులు చనిపోతున్నట్లు ఐక్యరాజ్య సమితి లెక్క కట్టింది. 'ప్రేమను రంగరించి శిశు ప్రాణము నిల్పగ చాలినంతగా' పాలు అమ్మల దగ్గర లేకపోవడం ఒక కారణం.

తల్లిపాలను, కన్నీళ్లను కూడా కల్తీ చేసే కార్పొరేట్ వ్యాపార సంస్కృతికి పాలుతాగే బిడ్డలు బలవుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. కల్తీ పాలను అరికట్టాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తల్లి పాల విశిష్టతను తెలిపేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రతియేటా ఆగస్టు మొదటి వారంలో 'తల్లిపాల వారోత్సవాలు' నిర్వహిస్తున్నారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్‌లో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం వుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. నవజాత శిశువుకు తల్లిపాలు అమృత తుల్యం. ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పౌష్టికాహారం తల్లిపాలే. నెలలు నిండకుండా పుట్టి ఎన్‌ఐసియులో ఉన్న పిల్లలకు పీడియాట్రిక్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మిల్క్ బ్యాంకులు ఉన్నాయి. పాలు దానం చేయాలనుకునే తల్లులు ఈ మిల్క్ బ్యాంకులకు దానం చేయవచ్చు. 'పసివగ్గు తొలి ఆరుమాసాలూ సంపూర్ణంగా తల్లిపాలమీదే ఆధారపడే క్షీరద' అని ఆయుర్వేదం చెబుతోంది. 'డబ్బా పాలు వద్దు- తల్లి పాలే ముద్దు' అనే నినాదం నలుదిక్కులా మార్మోగాలి. అప్పుడే మహాకవి జాషువా పేర్కొన్నట్లు 'అక్షయంబులైన మాతక్షీర మధురధార/ లన్నంబుగా తెచ్చుకున్న అతిథి'కి ఆహారం, ఆరోగ్యం దక్కుతుంది. అమ్మపాలే మిసిమి ప్రాయంలోనూ, ముదిమి వయసులోనూ సంజీవని.

# రోడ్డు పనులకు మంత్రి ధర్మాన శంకుస్థాపన



శ్రీకాకుళం రూరల్ : సింగుపురం పంచాయతీ, ఆదిత్య నగర్ కాలనీలో చేపట్టనున్న రోడ్డు పనులకు రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. ఇరవై లక్షల రూపాయల వ్యయంలో రెండు కిలోమీటర్ల పరిధిలో కొత్తగా రహదారి పనులు చేయనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించి శాఖాపరమైన అనుమతులు, నిధుల మంజూరు కూడా పూర్తయ్యాయని, రోడ్డు పనులు పూర్తైతే ఈ ప్రాంతం మరింత అభివృద్ధికి నోచుకుంటుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎమ్మార్వో వెంకట్రావు, ఎంపిడివో వెంకట్ రామన్, రాజేంద్రన్, సర్పంచ్ ఆదిత్య, ఎంపిటిసిలు బగ్గు అప్పారావు, నక్క శంకర్, అంబటి శ్రీనివాసరావు, ఎచ్చెర్ల శ్రీధర్, చల్లా శ్రీనివాసరావు, సీజు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## సీతంరాజు సుధాకర్ సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పూర్ణామార్కెట్ (విజయభాను న్యూస్): విశాఖ దక్షిణ నియోజకవర్గం లోని 36 వ వార్డు రంగిరిజు వీధిలో ఉన్న రామచంద్ర ప్రాథమిక పాఠశాలలో వైస్సార్సీపీ నాయకులు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్స హకారంతో వార్డ్ వైస్సార్సీపీ మాజీ అధ్యక్షుడ అలమండ విజయ్ , కోరుకొండ సూర్యప్రసాద్ సంయుక్త ఆధ్వర్యములో ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులుకు మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు చేతుల మీదుగా సుమారు 900 వందల నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో చదివే విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,అధ్యాపకులు,సిబ్బంది సితంరాజు సుధాకర్ కి కృతజ్ఞతలు తెలియజేసారు.కార్యక్రమంలో 36 వార్డ్ అనుబంధ సంఘాల అధ్యక్షులు,నాయకులు ప్రధాన శత్రు,ఒదురు వేణు,బొడ్డేటి కిరణ్,వంగలపూడి శ్రీనివాసరావు,కొప్పుల మురళి,మాధవ్,శ్యాం. వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చావా నూతన గృహ ప్రవేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలము గొర్లీవానిపాలెం పంచాయితి పరిధిలో నూతనంగా నిర్మించిన లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ చావా నర్సింహరావు నూతన గృహప్రవేశ కార్య క్రమానికి పెందుర్తి మాజీ శాసన సభ్యులు డైనిమిక్ లీడర్ కార్యకర్తలుకు నీను ఉన్నాను అంటూ భరోసా కల్పించే వ్యక్తి అజాతశత్రువు పంచకర్ల రమేష్ బాబు హాజరైన్నారు. అనంతరము మండలములో గల నాయకులు,కార్యకర్తలుతో కాసేపు ముచ్చటించారు.



## సమకాలీనం

### ఓటు రాజ్యాము

దేవుని సంపద మనుష్యుల్లారా...
దప్పికి కరువు దేశం గాదా?
నడిపిన వారికి దయ వుండాలి?
ఎల్తిగ లేక నడపాలండి.
ఎప్పుడు పోవును పేదరికాలు?
తిప్పలు తోను జనులకు బతుకు
కడిగిన కొలది పేదలు హెచ్చు
తప్పవ యీ బతుకులు ప్రజలకు.
ఓటు రాజ్యాము - ధరలకు పెరుగు
ఏమికొందుమా - గుండెకు బెగులు
ఎట్లా... అంటే...?
కాదను కుంటే...?
అట్లా... అయితే..?
పని, పాట్లంతే?
ఐక్య వేదికలు పెడుతున్నా...
చర్చలతోనూ...
కాలయాపనా...
కాలం నడకలు కాలందే...
మాటలు, వరుసలు మాటలవే...
మారేదెప్పుడు మన చోట...
మారేదెప్పుడు పాలన బాట.
జనాలుతో... జగడమాడితే...?
గొప్పకాదురా?
ధరలను బాగ అదుపు చేయరా...
జనాలు మీకు పూజింతురు రా...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

మాసం : శ్రావణ; తిథి : అష్టమి రా.11.25; స్వాతి ప.3.29; రా.వ.8.53ల 10.25.
శుక్రవారం 05 -08 -2022

a **మేషం:** ప్రేమికుల మధ్య నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఎప్పటి నుంచో వాయిదా పడుతున్న వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. b **వృషభం :** ఆకస్మిక ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. నిరుద్యోగులకు కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. స్త్రీలకు వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. ఆడిటర్లకు, అకౌంట్స్ రంగాల వారికి పనిభారం అధికంగా ఉంటుంది.C **మిథునం :** చిన్నతరహా పరిశ్రమలలో వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఖర్చులు పెరగటంతో రుణ యత్నాలు, చేబదుళ్లు స్వీకరిస్తారు. d **కర్కాటకం :** ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి అనుకున్నది సాధిస్తారు. అనుకోకుండా ఏర్పడిన ఒక స్నేహబంధం భవిష్యత్‌లో మీకు మంచే చేస్తుంది. సంతానం విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరుస్తారు. ఖర్చులు సామాన్యం. e **సింహం :** మొండి బాకా యిలు వసూలు కాగలవు. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగనైనా సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు. కుటుంబ విషయాలు, ఆర్థిక లావాదేవీలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.f **కన్య :** నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగు తాయి. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైన సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. పత్రిక, ప్రైవేటు సంస్థలలో వారికి మార్పులు అను కూలిస్తాయి. g **తుల :** దూర ప్రయాణాలలో మెళకువ అవసరం. తలపెట్టిన పనుల్లో ఒకింత జాప్యం, చికాకు తప్పదు. స్త్రీలు షాపింగ్ వ్యవహారా లలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త అవసరం. ఆత్మీయుల నుంచి సహాయాన్ని పొందుతారు. h **వృశ్చికం :** విద్యార్థులు అతి కష్టం మీద పై చదువులకు అవకాశం లభిస్తుంది. మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభి వృద్ధి. చేతి వృత్తుల వారికి ఓర్పు, నేర్పు ఎంతో అవసరం. నూతన పరిచయాలు ఏర్పడతాయి. i **ధనుస్సు :** వాహనం నడుపునపుటలో మెళకువ అవసరం. రాజకీయ నాయకులకు పదవి సమస్యలు అధికమవుతాయి. మిత్రుల సహకారంచో ఓ సమస్యను సునాయాసంగా పరిష్కరిస్తారు. కంప్యూటర్ రంగాల వారికి పురోభివృద్ధి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, వాణిజ్య ఒప్పందాల్లో మెళకువ వహించిండి. j **మకరం :** సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాలు గూర్చి తగాదాలు రావచ్చు. దైవ కార్యాలలో పాల్గొంటారు. రావలసిన ధనం చేతికందకపోవడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరగలదు. నిరుద్యో గులకు ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునః ప్రారం భించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. k **కుంభం :** కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు అదనపు సంపాదన దిశగా ఆలోచన చేస్తారు. L **మీనం :** కొత్తగా చేపట్టిన వ్యాపారాల్లో క్రమేణా నిలదొక్కు కుంటారు. ప్రముఖులతో ముఖ్య వ్యవహారంపై సంప్రది ంపులు జరుపుతారు. రుణ యత్నాల్లో ఆటంకాలు తొలగిపోతాయి. రావలసిన ధనం చేతికందుతుంది. గృహంలో దైవ కార్యక్రమాలుచేయుట వంటి శుభ పరి ణామాలు ఎదుర్కుంటారు. స్త్రీలకు పనిభారం అధికం.

# వాగ్గేయ కారుడు వంగ పండు ప్రసాదరావు విగ్రహం ఆవిష్కరణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రముఖ వాగ్గేయ కారుడు వంగపండు ప్రసాదరావు రెండవ వర్ధంతిని పురస్కరించుకుని బీచ్ రోడ్డులో వారి విగ్రహన్ని గురువారం సాయంత్రం మంత్రి సీదిరి అప్పలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భముగా మంత్రి మాట్లాడుతూ వంగపండు ప్రసాదరావు శ్రీకాకుళం జిల్లా ఉద్దానం వచ్చి జానపద నాటకాలను ప్రదర్శించే వారని, ఉద్యమాలకి ఉద్దానం ఆద్యమమన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి చైర్ పర్సన్ వంగపండు ఉష, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎం .ఎల్.ఎలు, ముత్తం శెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి , ఆర్.నారాయణ మూర్తి, కల్చరల్ డైరక్టర్ మల్లిఖార్జున రావు పాల్గొన్నారు. తదుపరి వి.ఎం .ఆర్.డి.ఎ., బాలల ప్రాంగణంలో వంగపండు ప్రసాదరావు 2వ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు మరియు ప్రముఖులను దుశ్శాలువలతో సత్కరించారు.





## మున్సిపల్ షాపులను
# సత్వరమే నిర్మాణం చేయాలి



భీమునిపట్నం : విజయభాను న్యూస్: జీవిఎంసి భీమిలి జోన్ 3వ వార్డు మెయిన్ రోడ్డులో తొల గిస్తున్న పాత మున్సిపల్ షాపుల స్థానంలో కొత్తవి నిర్మాణం చేయాలని జీవిఎంసీ అధికారులను, స్థానిక శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావులను 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ కోరారు. ఈ మేరకు అప్పలకొండ టి డి పి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు పరిశీలించారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ మెయిన్ రోడ్డు నిత్యం రద్దీగా ఉండటం, అందులో శుక్రవారం వరలక్ష్మి వ్రతం కావడంతో ఇంకా ఎక్కువ జనాలు మార్కెట్ కోసం వచ్చే అవకాశం ఉందనీ, మట్టిని తొలగించేటప్పుడు, మెషిన్ తో భవనాలు పడగొట్టేటప్పుడు ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకొనే విధంగా సూచించారు. శాసనసభ్యులు అవంతి శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాత షాపుల స్థానంలో కొత్తవి నిర్మాణం చేసి స్థానిక నిరుద్యోగులకు ఇంతకుముందు వ్యాపారం చేసుకున్న వారికి జీవిఎంసీ నియమ నంబంధనలు ప్రకారం షాపులను కేటాయించాలని ఆమె కోరారు.

# ఘనంగా తల్లి పాల వారోత్సవాలు



అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ భీమవరం గ్రామంలో అంగన్వాడీ మరియు మాన్సీ వారు సంయుక్తంగా ప్రపంచ తల్లిపాలు దినోత్సవం జరపడం జరిగింది. ప్రతీ సంవత్సరం ఆగస్టు మొదటి వారం లో ఈ కారిక్రమం ప్రతీ గ్రామంలో కూడా నిర్వహించడం జరుగుతుంది అందులో భాగంగా...

మండలం లోని గుమ్మకోట సెక్టార్ లో భీమవరం గ్రామంలో ఈ కారిక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కారిక్రమానికి పలువురు గర్భవతులు తల్లులు హాజరు కావడం జరిగింది అలాగే సెక్టార్ లోని అంగన్వాడీ టీచర్ లు హాజరు కావడం జరిగింది ముందుగా గర్భవతులు తల్లులతో మీటింగ్ పెట్టి తల్లి పాలు యొక్క ప్రాధాన్యత ను గురించి సెక్టార్ సూపర్ వైజర్ శ్యామల మరియు మాన్సీ కో ఆర్డినేటర్ మహేష్ వివరించడం జరిగింది అలాగే అంగన్వాడీ సేవలు వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ కిట్ కోసం వివరించారు.

తరువాత గ్రామంలో ర్యాలీ చేసి తల్లిపాలు యొక్క విశిష్టతను స్లొగన్స్ తో కొనియాడుతూ మానవ హారం నిర్వహించి కూడా ప్రచారం చేయడం జరిగింది. ఈ కారిక్రమానికి అంగన్వాడీ సూపర్ వైజర్ శ్యామల, ఏ ఎన్ ఎమ్ సత్యవతి,మాన్సీ కో ఆర్డినేటర్ మహేష్ టీచర్లు సునీత, సింహాచలం, నర్సమ్మ, సింహాచలం,లక్ష్మి, తిరుపతమ్మ, లక్ష్మి ఆశవర్కర్లు చిన్నతల్లి, సైలజ, సత్యవతి మరియు గౌరీ పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ఉచిత బియ్యం పంపిణీ?



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ఉచిత బియ్యం లబ్ధిదారులకు ప్రతి నెల కేజీల బియ్యం చొప్పున పంపిణీ చేస్తున్నటువంటి కార్యక్రమంలో భాగంగా గన్నెల పంచాయతీ కేంద్రంలో గల చౌక ధర దుకాణం లో గురువారం ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పంచాయితీ సర్పంచ్ బి.బొజ్జా ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన దారులు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న టువంటి అన్ని వినియోగించుకోవాలని ప్రతి ఒక్క లబ్ధిదారులు వాలంటీర్ల పంపిణీ చేస్తున్నటువంటి ఆగస్టు. సెప్టెంబర్ నెల లు సంబంధించి కూపన్తీసుకొని చౌక ధరదుకాణానికి ఆశ్రయించవలసి ఉందిగా లబ్ధిదారులకు పంచాయితీ సర్పంచ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో

ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్స్ వీఆర్వో నాగేశ్వరరావు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డలకు ఆరోగ్యం



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మండలం లోని రైవాడ గ్రామంలో అంగన్వాడి సిబ్బంది, వైద్య సిబ్బంది గురువారం అంగన్వాడి సెంటర్లో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వారోత్సవాలు ఆగస్టు ఒకటి నుండి 7 వరకు జరుగుతాయని అంగన్వాడి టీచర్ పద్మ తెలిపారు. బాలింతలు, గర్భవతులను ఏర్పాటు చేసి తల్లిపాలు వారోత్సవాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కె.పద్మ, పి. నాగమణి, రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం శాంతి, ఆశ వర్కర్లు దేముడమ్మ, దేవి తదితరులు ఉన్నారు.

## ఈనెల 6న అక్రమ మద్యం కేసులలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల వేలం

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : అక్రమ మద్యం కేసు లలో స్వాధీనం చేసుకున్న 2 ద్విచక్ర వాహనాలను అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 న ఉదయం 11గంటలకు భీమునిపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయబడునట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్.ఐ పద్మావతి చెప్పారు. ఆసక్తి గలవారు ఆరోజు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చుననీ ఆమె అన్నారు.

## సీఎం జగనన్నను కలిసిన పరవాడ జడ్పీటిసి పియస్.రాజు



పరవాడ (విజయభాను న్యూస్) : వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి పుష్ప గుచ్ఛం అందచేసిన పరవాడ మండలం జడ్పీటిసి మరియు జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ మెంబర్ పి ఎస్ రాజు మర్యాదపూర్వకంగా కలిసారు..అనంతరము సిఎం జగన్ జడ్పీటిసి పియస్ రాజును దుశ్శాలువాతో అభినందించారు.

## మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలి
### ఆదివాసీ సేన నాయకుడు సాయిబాబా దురియా



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ (విజయభాను న్యూస్) : మండలంలోని బొండం పంచాయితీ పరిధిలోగల పలు గ్రామాలలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపిటిసి ఆదివాసీ సేన రాష్ట్ర నాయకుడు సాయి బాబా దురియా తన స్వ గ్రామపంచాయతీ సచివాలయానికి గురువారం ఉదయం సంబంధిత అధికారులకు వినతి పత్రం ద్వారా తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొండం పంచాయతీ పరిధిలో ఇటీవల కాలంలో కొన్ని గ్రామాలలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ఉన్నారు అయితే మిగిలిన కొన్ని గ్రామాలలో తక్షణమే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలి ఈ సందర్భంగా ఆయన కోరారు.

## లోకేష్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

భీమునిపట్నం : విజయభాను న్యూస్ టి డి పి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై వైసీపీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వైకాపా నాయకులు దేవేందర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ

భీమిలి నియోజకవర్గ టి డీ పి ఇంచార్జ్ కోరాడ రాజుబాబు ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు భీమిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. భీమిలి నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ,తెలుగు యువత కమిటీ,టి.ఎన్.ఎస్.ఎఫ్ కమిటీలు ఆధ్వర్యంలో భీమిలి పోలీసు స్టేషన్లో పిర్యాదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో...

రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు గోడి అరుణ, నియోజకవర్గ మహిళ ఆధ్యక్షురాలు బోయి రమాదేవి, 4వ వార్డు మహిళ ఆధ్యక్షురాలు వాసుపల్లి పోలమ్మ, 6 వార్డు మహిళ ఆధ్యక్షురాలు పెంటపాటి బబ్బెలు దాసరి కాంతమ్మ, భీమిలి శినగం రామకృష్ణ, పాసి త్రినాధ్ కుమార్, దంతులూరి సిద్ధార్ధ వర్మ గరే సదానంద,కనకల అప్పలనాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# మెడికల్ పరీక్షలో మణికంఠ వాసవి ప్రతిభ



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : ఇటీవల నిర్వహించిన మెడికల్ పరీక్షలో జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించి తన ప్రతిభ కనబరిచింది దేవరాపల్లి కి చెందిన అమ్మాయి. ఆంధ్ర మెడికల్ కాలేజీ (కేజిహెచ్) విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో జరిగిన పిడియాట్రిక్ (చిన్న పిల్లల )విభాగం ఎండి పరీక్షలో దేవరాపల్లి గ్రామానికి చెందిన జాగరపు మణికంఠ వాసవి జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించింది. ఆమెకు అరుదైన గౌరవం దక్కడం పట్ల తల్లిదండ్రులు వెంకటరావు, లక్ష్మి, తాతయ్య అబద్ధం, బంధువులు గండేపల్లి సత్యనారాయణ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# విశాఖలో 4వరోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు




సబ్బవరం (విజయభాను న్యూస్) : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కు చట్ట బద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ మాన్యమంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎంఆర్పిఎస్ జాతీయ అధ్యక్షులు డా.మున్నంగి నాగరాజు ఆధ్వర్యంలో ఆగస్టు 1నుండి 12వరకు జీవీఎంసీ, గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈరోజు దీక్ష శిబిరానికి సంఘీభావం తెలియజేయడానికి సబ్బవరం మండలం నాయకులు వెళ్లారు. ఈ కార్యక్రమం లో పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గోటివాడ సామ్రాట్ కుమార్, సీనియర్ నాయకులు దువ్వు దుర్గాలు, నీటిపల్లి ముత్యాలు, కడితి సాధురావు, కొట్ర కన్నారావు, తోత్త రమూడి శ్రీనివాస్,చెంగల చిన్నారావు,పెట్ల వెంకటరమణ, దేవుపల్లి సంపూర్ణం, రెల్లి సంఘం నాయకులు ఆకుల ఆనందరావు బృందం తదితరులు పాల్గొన్నారు.

## అందరి సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం
### నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



గడపగడపలో మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : రాష్ట్ర ప్రజల సంక్షేమమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన వారందరికి పార్టీలు, రాజకీయాలు, కులాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలో 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎంజగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్న లబ్ధిదారులు సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ పెట్ల సత్యవతి, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు రుత్తల వాసు, సర్పంచ్ లక్ష్మి, గ్రామ నాయకులు చిటికెల రమణ, పలువురు వైసిపి నాయకులు, ఎంపిడిఒ అరుణశ్రీ, తహశీల్దార్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరి మరణంపై రాజకీయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చిన్న కుమార్తె ఉమామహేశ్వరి మరణంపై రాజకీయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ...

తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోడి అరుణ ఆధ్వం ్యంలో బీమిలి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.ఎన్టీఆర్ చిన్న కుమార్తె ఉమా మహేశ్వరి తన వ్యక్తిగత, అనారోగ్య కారణా లతో ఆత్మహత్య చేసుకుంటే దీనిపై వైసిపి సోషల్ మీడియా అసత్యాలతో, అబద్ధాలతో దుష్ప్రచారం చేయడం దుర దృష్టకర మన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుటుంబ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా, ఉమా మహేశ్వరి మరణాన్ని రాజకీయం చేసి స్వర్గీయ నందమూరి తారక రామారావు కుటుంబ ప్రతిష్టకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మనో భావాలకు భంగం కలిగించే విధంగా, వ్యవ హారిస్తున్నారని పేర్కొన్నారు. చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకొని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.

# 16వ వార్డులో పరిధిలో రూ.120.62 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన నగర మేయర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుకు వెళ్తున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె మూడవ జోన్, 16వ వార్డు పరిధిలోని పాత వెంకోజిపాలెం, రజకవీధి, కెఆర్ఎం కాలనీ, ఇసుకతోట తదితర ప్రాంతాలలో సుమారు రూ.120.62 లక్షల రూపాయలతో తారు రోడ్లు, కాలువలు, ప్రహరీ గోడ, కల్వర్టుల నిర్మాణం తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్రమాని విజయనిర్మల, స్థానిక వార్డు కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి అప్పారావుతో కలిసి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో అందరి సహకారంతో నగరంలో ఉన్న ప్రతి వార్డుని అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా వార్డులో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు దృఢ సంకల్పంతో ఉన్నామన్నారు. వార్డులో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా త్రాగు నీరు, విద్యుత్తు, పారిశుధ్యంతో పాటు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. వైఎస్ఆర్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వాలంటరీ వ్యవస్థ ద్వారా వివరాలు సేకరించి అర్హులైన కొత్తవారికి ఈ నెలలో పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాసరావు, వైఎసార్ సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు మంగళకరం వరలక్ష్మీ వ్రతం

## వివేకానంద సంస్థలో బంగారు కాసులు, పట్టు చీరలు పంపిణీ

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : శ్రావణ మాసం లో ప్రతి ఇంట భక్తిశ్రద్ధలతో నిర్వహించే వరలక్ష్మి వ్రతం మహిళలకు అత్యంత మంగళకరం అని ప్రముఖ సంఘ సేవకులు, వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్ అన్నారు.. గురువారం ఇక్కడ పాతనగరంలోని వివేకానంద అనాథ, వృద్ధాశ్రమంలో అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు సమకూర్చిన బంగారు కాసులు, పట్టు చీరలు ఇక్కడ సంస్థ మహిళా సభ్యులు కు అతిధుల చేతుల మీదుగా అందజేశారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇక్కడ ఉన్న వృద్ధులు, అనాథలకు నిరంతరం సేవలందిస్తున్న మహిళా సభ్యుల సేవలు ప్రశంసనీయమన్నారు.. కరోనా లో సైతం వీరు నిరంతరం ప్రాణాలు ఎదురొడ్డి ఎంతో మందికి తమ సేవలు అందించారన్నారు.. కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ తమ పరిధి మేరకు ఇతరులకు సహాయం చేయాలన్నారు.. ధనం శాశ్వతం కాదని చేసిన దానం మాత్రమే శాశ్వతము గా నిలిచి పోతుందన్నారు... వృద్ధులు, అనాథలను అక్కున చేర్చుకుని నిరంతరం తమ తల్లిదండ్రుల వలే ఇక్కడ మహిళా సభ్యులు వారిని ఆచరించడం ఎంతో గొప్ప విషయమన్నారు., అందువల్లే తాను ప్రత్యేకంగా వీరికి సంక్రాంతి కి పట్టు చీరలు అందచేశానని ఇప్పుడు వరలక్ష్మి వ్రతం దృష్టిలో ఉంచుకొని బంగారు కాసులు, చీరలు, పూజా సామగ్రి అందజేయడం జరిగిందన్నారు... గతంలో కూడా ఇక్కడ ఆశ్రమానికి తన వంతు విరాళంగా నిధులు, మంచాలు అందజేసినట్లు చెప్పారు.. సమాజ సేవలో పాల్గొన్న సంతృప్తి మరెక్కడా లభించదన్నారు. ఈ కార్యక్రమాల్లో రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ అహ్మద్, సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.. సభ్యులకి బంగారు కాసులు, పట్టుచీరలు వరలక్ష్మి వ్రత పూజా సామాగ్రి అతిథులు చేతుల మీదుగా అందజేశారు.. వృద్ధులు, అనాథలకు పండ్లు,వస్త్రాలు పంపిణి చేశారు.

# ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమంలో

## నాటకాన్ని ప్రదర్శించిన అంగన్వాడీ టీచర్లు






అనంతగిరి (విజయభాను న్యూస్) : మండలం కాశీపట్నం పంచాయతీ బంగారమ్మపేట గ్రామంలో తల్లిపాల వారోత్స వాలు కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్వాడి సూపర్వైజర్ రామ య్యమ్మ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ముర్రిపాలు పుట్టిన గంటలోపులే పట్టాలని దీని వలన బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని భవి ష్యత్తులో ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చిన తట్టుకునేట టువంటి శక్తి ఒక్క ముర్రిపాల లోని మాత్రమే ఉన్నాయని దీనితోపాటు ఇమ్యునైజేషన్ చార్ట్ ప్రకారం గర్భిణీ స్త్రీలు అందరూ ఫాలో అవ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ముర్రిపాలు ప్రత్యేకతపై అంగన్వాడీ టీచర్లు వీధి నాటకాన్ని ప్రదర్శించి గర్భిణీలు ,బాలింతల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. గర్భిణీలు, బాలింతలు కూడా అంగన్వాడి సేవలు సక్రమంగా ఉపయోగించుకొని పుట్టబోయే బిడ్డపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది అంగన్వాడీ టీచర్లు, 20 మంది గర్భిణీలు, బాలింతలు హాజరయ్యారు.

# సీడ్స్ విషవాయువుల లీకేజిపై భగ్గుమన్న బీజేపీ

## మహిళ కార్మికులకు ఉపాధి కల్పించి , యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

## బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : మహిళ కార్మికులకు ఉపాధి కల్పించి నష్ట పరిహారం చెల్లించాలని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎలమంచిలి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం బ్రాండిక్స్ దగ్గర బిజెపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యంపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గొంతిన భక్తసాయిరాం, అగ్గాల హనుమంతురావు రాజానరాజు, బుద్ధ విశ్వనాథం, పిట్టా దాసుబాబు, ఉమ్మిడి వెంకటేశ్వర్లు,మేరుగు కాసుబాబు, గోవిందరెడ్డి, కిషాన్ మోర్చా జోనల్ ఇంచార్జి పాకలపాటి రవిరాజు, ఇబ్రహీం బాషా జోగినాయుడు, రాంమోహన్, ఓరుగంటి నాగమణి,మళ్ళా ధనలక్ష్మి, ఓరుపుల శంకర్, నూకరాజు, రాజు నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరం

- జెడ్సీ సింహాచలం



గాజువాక (విజయభాను న్యూస్) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన తప్పనిసరి అని గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం అన్నారు. డెంగ్యూ నివారణ,తడి పొడి చెత్తపై అవగాహన సదస్సు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అద్వైర్యంలో బీసీ రోడ్డు,భానోజీ తోట, దుర్గాదేవి ఆలయాల వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటిస్తూ సమీప దుకాణాదారుల నుంచి యూజర్ చార్జీలను వసూలు చేశారు. చెత్తను ఇష్టానుసారంగా రోడ్లపై వేయకూడదని డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలని సూచించారు.డెంగ్యూ,మలేరియా,చికున్ గున్యా,సాధారణ జ్వరాల వ్యాప్తికి కారణమవుతున్న దోమల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించారు.తడి పొడి చెత్తను వేర్వేరుగా డస్ట్ బిన్ లలో వేసి పారిశుధ్ధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లోకనాథం,మద్దాల మణికంఠ,శానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, మంగునాయుడు,టి రాంబాబు,అర్జున్,ఎల్ వెంకట్రావు,సుందరరావు,కొండలరావు,నారాయణ మూర్తి,అడిగర్ల రమణ,సచివాలయాల సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

# "ట్రాన్స్ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్" ప్రాజెక్టు కింద విశాఖనగరం ఎంపిక

## - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మిశ

విశాఖపట్నం : "ట్రాన్స్ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్" ప్రాజెక్ట్ కింద విశాఖనగరం ఎంపికైనట్లు జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి లక్ష్మిశ తెలిపారు. గురువారం ఆయన ఢిల్లీ, జర్మనీ ప్రభుత్వ ఐక్యరాజ్య సమితి విశ్వవిద్యాలయం(యు ఎన్ యు), ఎన్ఐయూఏ ప్రాజెక్ట్ కింద ఇంటర్నేషనల్ క్లైమేట్ ఇనిషియేటివ్(ఐకెఐ) అమలుకోసం ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జర్మనీ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి విశ్వవిద్యాలయం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ కలిపి మన నగరాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా భారత దేశంలోని పట్టణ స్థానిక సంస్థల సమగ్ర విధాన రూపకల్పన, పరివర్తనాత్మకమైన వాతావరణం కొరకు సంయుక్తంగా వారితో కలిసి పని చేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టు యొక్క ప్రధాన లక్ష్యం వాతావరణ విపత్తులను ఎదుర్కోవడం, పర్యావరణ పరిరక్షణ, వనరుల పరిరక్షణ, అభివృద్ధి, సుపరిపాలన సంబంధించిన అంశాలు ఉంటాయని కమిషనర్ తెలిపారు. పైన తెలిపిన సమస్యలపై నగరపాలక సంస్థ ఎప్పటికీ పనులు చేయడంలో ముందంజలో ఉంటుందని తెలియజేశారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కావున వివిధ రకాల కార్యక్రమాలు చేపదుతున్నామని. ప్రతినిధులందరూ విశాఖ నగరానికి విచ్చేసి ఈ పనులన్నీ పర్యవేక్షించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని జివిఎంసి కమిషనర్ వారిని ఆహ్వానించామని తెలిపారు.



శ్రీ వంగపండు ప్రసాదరావు వర్ధంతి సందర్భంగా గురువారం సాయంత్రం ఆర్కే బీచ్ వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని మత్స్య శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు ప్రజా ప్రతినిధులు తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాగిరెడ్డి వంగపండు ఉష , కళాకారుడు అర్.నారాయణమూర్తి , కళాకారులు తదితరులు పాల్గొన్నారు.






# జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్ష



విశాఖపట్నం : నగరంలో చేపడుతున్న వివిధ పనులను వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి లక్ష్మిశ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపడుతున్న వివిధ పనుల పురోగతిని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఏర్పడిన గుంతలను 98శాతం పూర్తి అయ్యాయని మిగిలిన రెండు శాతం గుంతలను త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగా ఏర్పడిన గుంతలు ఉంటే వాటిని కూడా వెంటనే పూర్తి

చేయాలని అధికారులను ఆదేశించారు. జివిఎంసి పరిధిలో చేపడుతున్న 42 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇప్పటికే 21 కేంద్రాలు పూర్తి అయ్యాయని మిగిలిన వాటిలో 15 కేంద్రాలలో ఈం నెల చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని, ఆరు కేంద్రాలపై ఉన్న అభ్యంతరాలను త్వరితగతిన పరిష్కరించి సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. వార్డు అభివృద్ధి ప్రణాళికలో 948 పనులు చేపట్టాల్సి ఉందని, అందులో 511 పనులు టెండర్ స్టేజీలో ఉన్నాయని మిగిలిన పనులు రెండు వారాల్లో టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో వచ్చిన ఇంజనీరింగ్ సమస్యలు, ఫిర్యాదులు త్వరితగతిన పూర్తి చేయాలని, స్పందనలో వచ్చిన సాధారణ సమస్యలైన వీధి దీపాలు, త్రాగు నీరు లాంటి ఫిర్యాదులు అదే రోజు పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్థిక పరమైన అంశాలు ఉంటే వెంటనే అంచనాలు తయారు చేసి ఆమోదం కొరకు ఫైల్స్ పంపాలని ఆదేశించారు ఈ సమీక్షలో ప్రధాని ఇంజనీర్ రవికృష్ణ రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ హైకోర్టులో ఆరు జడ్జిల ఖాళీలు



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేవలం ఆరు న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ చేయాల్సి ఉందని న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఆమోదించిన శాశ్వత, అదనపు న్యాయమూర్తుల సంఖ్య 37 మాత్రమే అని చెప్పారు. అందులో ఆగస్టు 1 నాటికి 24 మంది న్యాయమూర్తులు ఉన్నారు. సుప్రీంకోర్టు కొలిజీయం జూలై 20న ఏడు మంది న్యాయాధికారులకు హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ సిఫార్సు చేసింది. దీంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరిందని మంత్రి చెప్పారు. మిగిలిన ఆరు జడ్జిల ఖాళీలకు సంబంధించి హైకోర్టు కొలీజియం నుంచి ఎలాంటి సిఫార్సులు ప్రభుత్వానికి అందలేదని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తుల ఖాళీల భర్తీ న్యాయవ్యవస్థ, పాలనావ్యవస్థ మధ్య సమన్వయంతో నిరంతరం కొనసాగే ప్రక్రియ. దీనికి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో వివిధ రాజ్యాంగ సంస్థల మధ్య సంప్రదింపులు, ఆమోదం అవసరం ఉంటుందని మంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల భర్తీని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## స్థాయి సంఘంలోని

# అంశాలన్నీ ఆమోదం

- నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశంను శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి పాత సమావేశ మందిరంలో జరిగింది. స్టాండింగ్ కమిటీ అంశాలలో మొత్తం 7 అంశాలు పొందు పరచగా అందులో అన్ని అంశాలు ఆమోదం పొందాయని చైర్పర్సన్ తెలిపారన్నారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికలు కాబడిన సభ్యులందరూ పాల్గొనగా జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి లక్ష్మీశ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో స్థాయి సంఘ సభ్యులుతో పాటు కార్యదర్శి పి నల్లనయ్య, డిసి(రెవెన్యూ) ఫణిరాం, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి వాసుదేవ రెడ్డి, 3, 5 జోన్ల కమిషనర్లు శివ ప్రసాద్, కృష్ణ, డిఇఓ శ్రీనివాస రావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ విద్యా సంబంధాలపై గీతం దృష్టి

## ఆస్ట్రేలియా వర్సిటీ ప్రతినిధులతో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్




సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : బోధన, పరిశోధనలలో పరస్పర సహకారం ద్వారా ఉన్నత విద్యాప్రమాణాలను నెలకొల్పడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యా సంబంధాలపై దృష్టి సారించిందని విశ్వవిద్యాలయం అకడమిక్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో గురువారం తేది: 04-08-2022న జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయంగా ఎదగడానికి గీతం ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. గీతం విద్యార్థులు వివిధ దేశంలో తమ ప్రతిభను చాటుతున్నారని వారితో నిరంతర సంబంధాలను తాము మెరుగుపరచుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి,గుణశేఖరన్, మేనేజ్‌మెంట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర, సైన్స్ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎమ్.బాలకుమార్, ఫార్మశీ కళాశాల డీన్ ప్రొఫెసర్ రామారావు, గీతం కెరీర్ సర్వీసెస్ సహాయ డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్, ఎ.శ్రీరామ్, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ, సిడ్ని యూనివర్సిటీ, న్యూ సౌత్‌వేల్ యూనివర్సిటీ, క్వీన్స్ ల్యాండ్ యూనివర్సిటీ, మెనాష్ యూనివర్సిటీ, ట్రినిటి కాలేజ్ ఆఫ్ డర్బన్, సింగపూర్ జేమ్స్ కుక్ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ప్రతినిధులు గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి వారి సందేహాలు నివృత్తి చేశారు. విదేశీ విద్యను అభ్యసించాలనుకునే వారికి పాస్‌పోర్ట్ సేవలపై అవగాహనకు ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయం ఏర్పాట్లు చేయిగా, స్టేట్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లు విద్యారుణాలపై అవగాహన కలిగించాయి.




# ఒత్తిడి లేని విద్యావిధానాన్ని అందిస్తున్నాం

## కంప్యూటర్ సైన్స్‌లో రూ 1.10 కోట్ల వ్యయంతో మౌళిక వసతులు ఏర్పాటు

## విద్యార్థులకు ఉపయుక్తంగా రూఫ్‌టాప్ ఓపెన్ ఆడిటోరియం

## వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఒత్తిడిలేని విద్యా విధానాన్ని అందిస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో నూతనంగా దాదాపు రూ 1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన తరగతి గదుల సముదాయం, రూఫ్‌టాప్ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, క్యాంటీన్ సముదాయాలను ఆయన విద్యార్థులతో కలసి ప్రారంభించారు. అనంతరం వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఆనందాయకంగా విద్య బోధన, అభ్యసనం ఉండాలనే ఉద్దేశంతో మౌళిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అదే విధంగా నాడు-నేడు స్పూర్తితో విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్, విద్యార్థినులకు అదనపు టాయిలెట్స్, రెస్ట్‌రూమ్‌లు సైతం ఏర్పాటు చేసామన్నారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో గత సంవత్సరం ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ కోర్సును ప్రారంభించామని, ఈ విద్యా సంవత్సరం ఫుడ్ టెక్నాలజీ కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ఉన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సును సైతం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మరొక మంచి అవకాశం ఇస్తున్నామన్నారు. ఇక్కడ ఇంజనీరింగ్ చేరే విద్యార్థులు అస్ట్రేలియాలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా యూనివర్సిటీలో, అమెరికాలోని పర్డు యూనివర్సిటీలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. రెండేళ్లు ఏయూలో, మిగిలిన రెండు సంవత్సరాలు వెస్ట్రన్ ఆస్ట్రేలియా వర్సిటీ, పర్డు వర్సిటీలలో చదివే అవకాశం ఇస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామని, ఈ దిశగా త్వరలో ఎంఓయూ చేసుకుంటున్నామన్నారు. ఇటీవల వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఏయూను సందర్శించి సంయుక్తంగా కోర్సుల నిర్వహణకు ప్రతిపాదన చేసారన్నారు.

ఏయూ సంగీత విభాగానికి అనుసంధానంగా డిజిటల్ రికార్డింగ్ స్టూడియోను రూ 5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన ఎంఓయూను త్వరలో చేసుకుంటున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా సౌండ్ ఇంజనీరింగ్‌లో కోర్సులను నిర్వహిస్తామన్నారు. సినిమా రంగంలో సౌండ్ ఇంజనీరింగ్ కోర్సులు చేసిన వారికి భారీ వేతనాలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఏయూలోని కె.వి గోపాలస్వామి ఆరుబయలు రంగస్థలం(ఓపెన్ ఎయిర్ థియేటర్)కు సీటింగ్ ఏర్పాట్లు త్వరలో పూర్తిచేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

విభాగ పూర్వవిద్యార్థి అమల్ రాజ్ సహాయంతో విద్యార్థులకు ఉపాధిని అందించే విధంగా డిజిఫాక్ట్ సంస్థను ఏయూలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లో కోడ్ టెక్నాలజీపై వీరు పనిచేస్తారని, సిఎస్ఈతో పాటు ఇతర విభాగాల విద్యార్థులకు ఉపాధి అవకాశాల కల్పనకు వీరు కృషిచేస్తారని, కొద్దిరోజుల్లో ఇది పూర్తస్థాయిలో సేవలు ప్రారంభిస్తుందన్నారు. సిఎస్ఇ విభాగంలో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ ఓపెన్ ఆడిటోరియంలో ప్రముఖ సినీ గాయుకుడు, ఏయూ సంగీత విభాగం పరిశోధక విద్యార్థి ధనుంజయ్ హాజరయ్యారు. పలు పుష్ప, రేసుగుర్రం తదితర సినిమాలలో గీతాలను ఆలపించి, విద్యార్థులను ఉత్సాహపరిచారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, పాలక మండలి సభ్యులు ఆచార్య జేమ్స్ స్టీఫెన్, విభాగాధిపతులు ఆచార్య కె.నాగేశ్వర రావు, విజనాయంద రావు, ఆచార్యులు, పరిశోధకులు, డీన్‌లు, తదితరులు పాల్గొన్నారు.



# నీటి వృధాను అరికట్టండి

## - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నగరంలో నీటి వృధాను అరికట్టాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి లక్ష్మీశ మంచినీటి విభాగపు అధికారులను ఆదేశించారు.

గురువారం ఆయన జోన్-4, 37వ వార్డు పరిధిలోని రెల్లి వీధి, జబ్బరి తోట, పెయిన్దొర పేట తదితర ప్రాంతాలలో వార్డు కర్పొరేటర్ చెన్నా జానకీరామ్ తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్రాగునీరు వృదాగా పోతుందని, ప్రతి కోలాయిలకు నాబ్‌లు అమర్చి నీటి వృధాని అరికట్టాలని అధికారులను ఆదేశించారు. వార్డు మురికివాడ ప్రాంతం అయినందున ఇక్కడ వున్న ఇళ్ళ పైకప్పులపై చెత్త, వ్యర్థాలు, కర్రలు వున్నాయని, వాటిని తొలగించి ఇళ్ళ పైకప్పులపై వ్యర్థాలు లేకుండా చూడాలని ప్రజలకు సూచించారు. వార్డులో యుజిడి చాలా చోట్ల కొన్ని నెలల నుండి పొంగుతుందని దానిని పరిష్కరించాలని స్థానిక ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకు రాగా కమిషనర్ స్పందిస్తూ యుజిడి సమస్యను దగ్గరుండి శుభ్రం చేయంచారు. శాశ్వత పరిష్కారం కొరకు టెండర్లు పిలిచామని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకోచ్చారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ఏర్పటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు చేపట్టాలని, ఫాగింగ్, స్ప్రేయింగ్ ఎప్పటికప్పుడు చేయాలని మలేరియా అధికారులను ఆదేశిం చారు. పూల కుండీలు, ఖాళీ సీసాలు, నీటి తొట్టెలలో నీరు నిల్వ లేకుండా చూడాలని స్థానిక ప్రజలకు సూచించారు.

ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఎసిపి వెంకటేశ్వరరావు, ఎఎంఓహెచ్ డాక్టర్ ఎన్ కిషోర్, కార్యనిర్వాహక ఇంజనీరు డి వి రమణ మూర్తి, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com